క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



జమ్మికుంట: డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేశ్ శనివారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయినేని రాజేశ్వర్‌రావు, నాయకులు మైస మహేందర్, పాతకాల అనిల్, పంజాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దంపతులకు సన్మానం



సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

హుజూరాబాద్: ఇటీవల పదవీ విరమణ పొందిన హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు గందె రాధిక–శ్రీనివాస్‌లకు శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణ అభివృద్ధితోపాటు ఆర్యవైశ్య సంఘ భవనానికి కృషి చేశామని, తన ఎదుగుదలకు కారణమైన పట్టణ ప్రజలు, ఆర్యవైశ్యులకు అండగా ఉంటామన్నారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సుద్దాల హరిశంకర్, కార్యదర్శి నూక శ్రీనివాస్, సురేశ్, నాగరాజ్, శ్రావణ్‌కుమార్, నార్ల అర్చన, ఈశ్వరయ్య, నార్ల రాజేందర్, క్యాస చక్రధర్, ప్రసాద్, క్యాస ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



సన్మానిస్తున్న నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావును ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. 30 వార్డుల అధ్యక్షులతో కలిసి పూలమాల వేసి శాలువాతో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

కానిస్టేబుళ్లకు..



శంకరపట్నం: కాచాపూర్ గ్రామానికి చెందిన గడ్డం ఆంజనేయులు, మాతంగి మహేశ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు సాధించారు. శనివారం కాచాపూర్ మాజీ సర్పంచ్ దంపతులు కోండ్ర రాజయ్య–విజయ సత్కరించారు.

16 మందికి కంటి ఆపరేషన్లు

రామడుగు: వెదిర గ్రామంలో లయన్స్ క్లబ్, రేకుర్తి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి ఆపరేషన్లు నిర్వహించి ఇంటికి పంపించే ముందు నిర్వాహకులు శనివారం పండ్లు పంపిణీ చేశారు. 16 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. మంకమ్మతోట లయన్స్ క్లబ్ ప్రతినిధులు బూర్ల విద్యాసాగర్, రవీందర్‌రాజు, పాత విశ్వనాథం, శంకరయ్య, నాగుల రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

వీణవంక: రెడ్డిపల్లి గ్రామంలో సగర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. హన్మకొండకు చెందిన ప్రముఖ నేత్ర వైద్యుడు గుండేటి గణేశ్ 100 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సగర సంఘం సభ్యులను సన్మానించారు. దేవునూరి శ్రీనివాస్, కట్ట రాజు, కుమారస్వామి, కట్ట శ్రీనివాస్, కుర్మిండ్ల జ్యోతి, కట్ట అశోక్ తదితరులున్నారు.

సీఎంను కలిసిన నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌కార్పొరేషన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. తనను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో ఆయన హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులను కలిసి ధన్యవాదాలు తెలిపారు.



చదువుపై దృష్టి సారించాలి

చిగురుమామిడి: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత ఫలితాలు సాధిస్తేనే భవిష్యత్ బాగుంటుందని, గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని తిమ్మాపూర్ ఎక్సైజ్ ఎస్సై భారతి కోరారు. శనివారం సాయంత్రం బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు, ఎక్సైజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మార్కండేయస్వామికి పూజలు

హుజూరాబాద్: హుజూరాబాద్ చేనేత సహకార సంఘంలో శనివారం శ్రీభక్త మార్కండేయస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మార్కండేయస్వామికి పూజలు చేసి చల్లగా చూడాలని వేడుకున్నారు. చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఎలిగేటి ఉపేందర్, పూజారి కుసుమ నాగరాజు, ఉపాధ్యక్షుడు వేముల యాదగిరి, మేనేజర్ నక్క వైకుంఠం, రాజగోపాల్, గుండేటి దేవయ్య, సబ్బని రాజేందర్, సంగెం సత్యనారాయణ, కూరపాటి రామచంద్రం, నేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మానసిక ఒత్తిడికి గురికావద్దు

చిగురుమామిడి: విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా తల్లిదండ్రులు ఇంటి వద్ద చూసుకోవాలని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ హర్షిత్‌కౌర్ కోరారు. శనివారం సాయంత్రం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పదోతరగతి విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వాలని ఆదేశాలు జారి చేసిందన్నారు. ప్రతిరోజు ఇంటి వద్ద బలమైన పోషకాహారం అందించాలని, సరైన నిద్ర పోయేలా చూసుకోవాలని అన్నారు.

సర్కారు బడులకు సొబగులు



అందంగా కనిపిస్తున్న ప్రభుత్వ పాఠశాల



రంగులు వేస్తున్న వ్యక్తి

- అమ్మ ఆదర్శ పాఠశాలలకు రంగులు
- ప్రైవేట్‌కు దీటుగా రూపుదిద్దుకున్న వైనం
- రానున్న విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం

మానకొండూర్: ప్రభుత్వ బడులకు రంగులు వేస్తుండటంతో కొత్త సొబగులు సంతరించుకుంటున్నాయి. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కంకణం కట్టుకొని మన ఊరు.. మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట నిధులు మంజూరు చేశాయి. ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రభుత్వ బడులకు రంగులు వేసి కొత్త రూపురేఖలు తెచ్చేందుకు కృషి చేశాయి. ప్రభుత్వ బడులకు రంగులు వేయడంతో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయి.

42 పాఠశాలలకు కొత్త శోభ

ఏళ్లుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు చాలావరకు శిథిలావస్థకు చేరుకోవడం, పాఠశాలలో విద్యుత్ సౌకర్యం సరిగా లేకపోవడం, మరుగుదొడ్లు పాడైపోవడం, నల్లా నీళ్లు సరిగా రాకపోవడం, కిటికీలు, దర్వాజ, తలుపులు చెదలు పట్టి పాడై ప్రభుత్వ పాఠశాలలు కళావిహీనంగా తయారయ్యాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు.. మన బడి ప్రణాళికల్లో భాగంగా మండలంలోని 19 ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 23 ప్రభుత్వ స్కూళ్లలో మరమ్మతు పనులు చేపట్టి అందంగా తీర్చిదిద్దారు. మండలంలోని 42 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు.. మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలలు కింద పాఠశాలల్లో మరుగుదొడ్లు, కిటికీలు, ఫర్నిచర్ ఏర్పాటు, గోడల పగుళ్లు, విద్యుత్ సరాఫరా, తాగునీటి వసతి ఇలా అనేక మరమ్మతు పనులు చేపట్టింది. ఒక్కో పాఠశాలలకు మరమ్మతు పనుల కింద రూ.లక్ష నుంచి సుమారు రూ.8లక్షల వరకు నిధులు కేటాయించడంతో ఆయా పాఠశాలల యాజమాన్య కమిటీలు ఈ పనులు చేపట్టి పూర్తి చేసింది. తాజాగా ప్రభుత్వ బడులకు రంగులు అద్దాలని ఏజెన్సీలకు ప్రభుత్వం బాధ్యత అప్పగించగా.. ఆయా ప్రభుత్వ పాఠశాలలకు రంగులు వేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఈ పనులు కూడా పూర్తవనున్నాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వ బడులకు మరమ్మతు పనులతో పాటు వివిధ రంగులు వేయడంతో కొత్త సొబగులు సంతరించుకుంది. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో కచ్చితంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యత గ్రామస్తులదే..



అమ్మ ఆదర్శ పాఠశాలలు, మన ఊరు.. మన బడి ప్రణాళికల్లో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చాలావరకు సమస్యలు తీరాయి. విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, నీటి సమస్య డోర్లు, ఫర్నిచర్ ఇలా అన్ని రకాల సమస్యలు పరిష్కారమయ్యాయి. బడులకు రంగులు కూడా వేయడంతో అందంగా కనిపిస్తున్నాయి. గ్రామాల్లో పాఠశాలలను ఆకతాయిలు పాడు చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులదే.

– మధుసూదనాచారి, మండల విద్యాధికారి

ముగిసిన గ్రామసభలు



ఇందుర్తిలో పాల్గొన్న అధికారులు, నిర్వాసితులు

చిగురుమామిడి: గౌరవెల్లి సాగునీటి కాల్వల కింద భూములు కోల్పోతున్న నిర్వాసితుల(అవార్డు ఎంక్వయిరీ) గ్రామసభలు ముగిశాయి. గత నెల 27 నుంచి జనవరి 1 వరకు కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ ఆధ్వర్యంలో ఆరు గ్రామాల్లో అవార్డు ఎంక్వయిరీ సభలు నిర్వహించారు. గత నెల 28 నుంచి 30 వరకు భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ ఏడు గ్రామాల్లో నిర్వాసితులతో సమావేశాలు నిర్వహించారు. ఇందుర్తి గ్రామంలో శనివారం చివరి రోజు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామంలో 27 మంది రైతులకు చెందిన 8.17ఎకరాల వ్యవసాయభూమి కాల్వల తవ్వకంలో పోతున్నందున రైతులు తమకు సరైన ధర ప్రకటించడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ డీఈఈ ప్రశాంత్‌కు తమ గోడును వెల్లబోసుకున్నారు. తమకు మార్కెట్ ధర ప్రకారం తగిన ధర నిర్ణయిస్తేనే సంతకాలు పెడతామన్నారు. అంతవరకు పనులు కూడా జరగనియ్యమని అన్నారు. ఏఈలు రాకేశ్, రచన, సీనియర్ అసిస్టెంట్ రజని, జూనియర్ అసిస్టెంట్ స్వప్న, ఆర్‌ఐ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంటికొకరు తరలిరావాలి

చొప్పదండి: వెయ్యి గొంతులు, లక్ష డప్పులు, మాదిగల గుండె చప్పుడు కార్యక్రమాన్ని ఇంటికొకరు చొప్పున వచ్చి విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామంచ భరత్ కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. తడగొండ శంకర్, సీపెల్లి నరేశ్, చిలుక దేవేందర్, గజ్జెల రాజేశ్వరి, ఎర్ర ఆదిత్య, మేకల అంజయ్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో, యూనియన్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని ఎమ్మార్సీ భవనం ఆవరణలో తెలంగాణ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వార్షిక క్యాలెండర్‌ను జమ్మికుంట, ఇల్లందకుంట ఎంఈవోలు హేమలత, రాములు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏలు, 40 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. జమ్మికుంట, ఇల్లందకుంట మండల శాఖ అధ్యక్షులు దేవోజు నాగరాజు, కొర్ర గోపి, ప్రధాన కార్యదర్శులు తోట వేణుగోపాల్, సుధాకర్, అసోసియేట్ అధ్యక్షులు తాళ్ల తిరుపతి, రావుల రమేశ్, జిల్లా ఉపాధ్యక్షులు పోగుల ఆంజనేయులు, శ్రీనివాస్, రాసపల్లి సరిత, అంజుమ్, జిల్లా కార్యదర్శులు జూపాక వీరస్వామి, అకుల వేణుగోపాల్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: కాట్నపల్లి, రుక్మాపూర్, చాకుంట గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం పరామర్శించారు. కాట్నపల్లిలో ఆత్మహత్యకు పాల్పడ్డ పంబాల రాకేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పురం రాజేశం తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

శంకరపట్నం: మక్త గ్రామ శివారులో శనివారం రాత్రి మోటార్ సైకిల్ ఢీకొని ఎల్కపల్లి నర్సమ్మ(52) అనే మహిళకు తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. ముత్తారం గ్రామానికి చెందిన బండ పర్శరాములు భార్య వెంకటమ్మతో కలిసి మానకొండూర్‌లో బంధువు దశదినకర్మకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మక్త గ్రామానికి చెందిన నర్సమ్మ వ్యవసాయ పొలం ముగించుకొని ఇంటికి వస్తుండగా.. గ్రామ శివారులో పర్శరాములు నడుపుతున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నర్సమ్మకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కి సమాచారమందించారు. ఈఎంటీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వీణవంక: మల్లన్నపల్లి గ్రామానికి చెందిన నామిని ఉమాదేవి(40) అనే మహిళ అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు యత్నించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. నామిని శ్రీనివాస్–ఉమాదేవి దంపతులు. వీరికి కుమారుడు, కూతురున్నారు. మూడేళ్ల క్రితం ఇంటి నిర్మాణం చేపట్టారు. రూ.20లక్షలు అప్పయ్యింది. వ్యవసాయ పంటల దిగుబడి కూడా సరిగా రాక అప్పులు ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురయ్యారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో గత నెల 31న ఉమాదేవి పురుగుల మందు తాగింది. కుటుంబీకులు గమనించి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

వ్యక్తిపై కేసు

జమ్మికుంట: భూవివాదంలో దాడికి పాల్పడిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి శనివారం తెలిపారు. మున్సిపల్ పరిధి మోత్కులగూడెం గ్రామానికి చెందిన పొనగంటి మల్లయ్య అనే వ్యక్తి మాచనపల్లి శివారులో వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. మాచనపల్లి గ్రామానికి చెందిన రామంచ సంపత్‌తో గొడవ జరుగుతున్న క్రమంలో కోర్టులో కేసు వేశారు. మల్లయ్యకు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినా.. భూమి వద్ద సంపత్ బూతులు తిట్టి కర్రతో కొట్టడానికి వచ్చి చంపుతానని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం..

ఓ యువతి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన కోల సదయ్య కూతురు అనూష(వికలాంగురాలు) అనే యువతి శుక్రవారం కనపర్తి నుంచి సెయింట్ జోసెఫ్ స్కూల్ వ్యాన్‌లో జమ్మికుంట వచ్చి శివాలయం గుడికి వెళ్లానని చెప్పింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ స్విచాఫ్ వచ్చింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేదు. తండ్రి సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దళితులకు న్యాయం



మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని, దళిత బంధు నిధుల విడుదల ద్వారా మరోసారి అది రుజువైందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లు ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా ఉన్న కౌశిక్‌రెడ్డి దళిత బంధు నిధులు విడుదల చేయడానికి ఎందుకు ప్రయత్నించలేదని ప్రశ్నించారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా లబ్ధిదారులకే నిధులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై కౌశిక్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి పలువురు జర్నలిస్టులు ప్రణవ్ నివాసంలో కలవగా.. సానుకూలంగా స్పందించారు.

జర్నలిస్టుల పోరాటానికి సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న వెంకటేశ్

హుజూరాబాద్: ప్రజలు, ప్రభుత్వానికి వారధి లాంటి జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారాపు వెంకటేశ్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో మాట్లాడారు. మా ఇల్లు మాకు కావాలని జర్నలిస్టులు చేస్తున్న నిరసన పోరాటాలకు ఏఐఎస్‌ఎఫ్ పూర్తి మద్దతుంటుందన్నారు. జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నా.. ప్రభుత్వం పూర్తిస్థాయిలో అనుమతివ్వకపోవడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వం 70 ఇళ్లకు పైగా నివేశన స్థలాలివ్వగా.. జర్నలిస్టులు అప్పులు చేసి రూ.లక్షలు వెచ్చించి ఇల్లు కట్టుకున్నారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి కేషబోయిన రాము, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, కోశాధికారి లద్దునూరి విష్ణు, జిల్లా నాయకుడు కసిరెడ్డి సందీప్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

చెల్లుబాటు ముగిసేరోజు చెక్కుల పంపిణీ



చెక్కు చూపిస్తున్న కొలకాని రాజు

జమ్మికుంట: పట్టణం, మండలంలో కల్యాణలక్ష్మి చెక్కుల చెల్లుబాటు ముగిసేరోజు పంపిణీ చేయడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు అన్నారు. శనివారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జనవరి 24న కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీడీవో కార్యాలయంలో 86 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయగా.. వాటిలో 30 మంది చెక్కులు జనవరి 24న చెక్కు గడువు ముగుస్తుండడంతో కేవలం 9 మందికి మాత్రమే చెల్లుబాటు అయ్యాయన్నారు. మిగతా 21 మంది కాలేదని, తిరిగి రెవెన్యూ డివిజన్ అధికారులకు అందజేసినట్లు చెప్పారు. చెక్కులపై మూడు నెలల గడువున్నా పంపిణీలో స్థానిక ఎమ్మెల్యే, అధికారుల నిర్లక్ష్యం చేశారన్నారు. బచ్చు శివకుమార్, రాజేశ్‌ఠాకూర్, నిరూపరాణి, ఇటుకల స్వరూప, రాము, గణేశ్, మహేందర్, కొమ్ము అశోక్, ప్రవీణ్, జోర్క శ్రీనివాస్, రాజేశ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు



నినాదాలు చేస్తున్న నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డికి టికెట్ కేటాయించగా.. పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద శనివారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ.. నరేందర్‌రెడ్డి విద్యాసంస్థలు నెలకొల్పి ఎందరో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారన్నారు. యువజన నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ సన్ని, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు అలీ, అజమాద, సోహల్, సమీర్, నరేశ్, రాజేశ్, బబ్బులు, మహేశ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

జాతర ప్రచార రథాలు ప్రారంభం

శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి జాతర ప్రచారం రథాలను ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి ప్రారంభించారు. ఈనెల 4న జాతర ప్రారంభమై 19 వరకు కొనసాగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రచారం చేసేందుకు ప్రచార రథాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ జోనల్ ఆసుపత్రిలో డాక్టర్‌ను నియమించాలి

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్ జోనల్ ఆసుపత్రిలో పర్మనెంట్ డాక్టర్‌ను నియమించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వర్కర్స్ యూనియన్ నాయకులు శనివారం జోనల్ ఈడీ ఖుస్రోషాఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర చైర్మన్ అబ్రహం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ మల్లేశం గౌడ్, నాయకులు మహేందర్ తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

విద్యానగర్(కరీంనగర్): హైదరాబాద్‌లో ఈనెల 7న నిర్వహిస్తున్న వెయ్యి గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం కరీంనగర్‌లో ఎమ్మార్పీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు అనిల్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి భరత్, కళామండలి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ఆంజనేయులు పాల్గొన్నారు.

నియామకం

మానకొండూర్: గట్టుదుద్దెనపల్లి కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం గ్రామ శాఖ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా గొడిశాల రాజయ్య, ఉపాధ్యక్షుడిగా బత్తిని శ్రీనివాస్, సభ్యులుగా బండపల్లి రమేశ్, మడ్డి నగేశ్, మడ్డి నాగయ్య, మడ్డి మల్లికార్జున్, మడ్డి రవీందర్, గట్టు లక్ష్మి, గొడిశాల లింగమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పెగడ స్వర్ణలత వ్యవహరించారు.



రాజయ్య

రామడుగు: శ్రీరాములపల్లి గ్రామ శ్రీవెంకటరమణారెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఊట్కూరి అభిలాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండ తిరుపతిరెడ్డి, సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



అభిలాష్‌రెడ్డి